సాక్షి నల్లగొండ

ఆదివారం । 7 । జూలై । 2024



ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధికి కృషి

గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధికి కృషిచేస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.

- 8లో



'ఫలక్‌నుమా'లో సాంకేతిక సమస్య

ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైలు సాంకేతిక సమస్యతో శనివారం మిర్యాలగూడ స్టేషన్‌లో నిలిచిపోయింది.

- 8లో

గరిష్టం / కనిష్టం

34° / 26°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మూడురోజులు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం

నల్లగొండ : అన్ని మున్సిపాలిటీలు, గ్రామాల్లో మూడు రోజులపాటు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్ ఎస్.నారాయణరెడ్డి అన్నారు. స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌పై ఆయన శనివారం జిల్లా, మండల, గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. గ్రామ పంచాయతీ ఆవరణతోపాటు, ప్రభుత్వ సంస్థలు, రహదారులకు ఇరువైపులా పిచ్చి మొక్కలు తొలగించాలని, చెత్తా చెదారాన్ని తీసివేయాలని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. కార్యాలయ ఆవరణ శుభ్రంగా లేకపోతే సంబంధిత జిల్లా అధికారులే బాధ్యత వహించాలన్నారు. సోమవారం మండలస్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు టి.పూర్ణచంద్ర, జె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

నల్లగొండ రూరల్ : తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచలేశ్వరుడి గిరి ప్రదక్షిణ కోసం ప్రతి పౌర్ణమికి ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఏడు డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్‌ఎం రాజశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నెల పౌర్ణమికి రద్దీని బట్టి ప్రత్యేక బస్‌లు నడుపుతామని పేర్కొన్నారు. అరుణాచలం వెళ్లే భక్తులకు ఏపీలోని కాణిపాకం, తమిళనాడు వెల్లూరు గోల్డెన్ టెంపుల్ దర్శనం ఉంటుందని, వివరాల కోసం సమీప బస్‌స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

ఆగస్టు 4న టీటీసీ పరీక్షలు

నల్లగొండ : టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ కోర్స్ (టీటీసీ) కోర్సు థియరీ పరీక్షలు ఆగస్టు 4న ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు డీఈఓ భిక్షపతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 4న ఆదివారం ఎడ్యుకేషనల్ సైకాలజీ స్కూల్ అడ్మినిస్ట్రేషన్ పరీక్ష ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మెథడ్స్ ఆఫ్ టీచింగ్ జనరల్ పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు, మెథడ్స్ ఆఫ్ టీచింగ్ స్పెషల్ పరీక్ష 3.30 నుంచి 4.30 వరకు జరుగుతాయని తెలిపారు. మే/జూన్-24లో 42 రోజుల టీటీసీ సమ్మర్ ట్రైనింగ్ కోర్సు పూర్తి చేసిన వారు, పరీక్షల్లో ఫెయిలైన వారు కూడా హాజరు కావాలని పేర్కొన్నారు.

నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ జిల్లా కమిటీ ఎన్నిక



నియామక పత్రాలను అందజేస్తున్న ఉషాకిరణ్

నల్లగొండ టౌన్ : నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ జిల్లా కమిటీని శనివారం స్థానిక టీఆర్‌టీయూ భవన్‌లో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రుద్రాక్షి మురళి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నెలకొండ దకాశి లింగస్వామి, ప్రధాన కార్యదర్శిగా పట్టల నాగరాజు, ఉపాధ్యక్షుడిగా పిట్టల రామోజీని ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై రాష్ట్ర అధ్యక్షుడు వలువాయి ఉషాకిరణ్ ఎన్నికైన వారికి నియామకపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వల్లబాయి తిరుపతి, ఆర్గనైజింగ్ సెక్రటరీ వలవాయి శ్రీను, దవరాయ సురేష్, తోకల రమేష్ పాల్గొన్నారు.

లైసెన్స్ లేకపోతే చర్యలు తప్పవు



లైసెన్స్ జారీ చేస్తున్న జ్యోతిర్మయి

నల్లగొండ టూటౌన్ : వైన్స్‌ల యజమానులు ఫుడ్ సేఫ్టీ కార్యాలయం నుంచి లైసెన్స్ తీసుకోకపోతే చట్ట ప్రకారం చర్యలు తప్పవని యాదాద్రి జోనల్ ఫుడ్ సేఫ్టీ కంట్రోలర్ వి.జ్యోతిర్మయి అన్నారు. శనివారం నల్లగొండ పట్టణంలోని మూడు వైన్స్‌లను ఆమె తనిఖీ చేశారు. దుకాణాల్లో పలు రకాల కంపెనీలకు చెందిన లిక్కర్ బాటిళ్లు ఆహార పరిరక్షణ ప్రమాణాల చట్టానికి అనుకూలంగా లేవని శాంపిల్స్ సేకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ లైసెన్స్ తీసుకోకుండా విక్రయాలు జరుపుతున్న వైన్స్ యజమానులకు నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. లైసెన్స్ తీసుకోకపోతే రూ.5 లక్షల జరిమానాతో పాటు నెల రోజుల జైలు శిక్ష ఉంటుందని స్పష్టం చేశారు. శాంపిల్స్ నివేదిక ఆధారంగా తీవ్రతను బట్టి చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆమె వెంట జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి స్వాతి ఉన్నారు.







పెట్స్‌కు వ్యాక్సినేషన్

జూనోసిస్ డే సందర్భంగా శనివారం నల్లగొండలో కుక్కకు యాంటీ రేబిస్ టీకా వేస్తున్న పశుసంవర్ధశాఖ జెడీ శ్రీనివాసరావు, టీకా వేయించేందుకు పిల్లి, కుక్కతో వచ్చిన పెంపకందారులు

పదెకరాల్లోపే.. రైతు భరోసా!

- సాగు చేసే భూములకే అమలు చేస్తే మేలు
- వెంచర్లు, వ్యవసాయేతర భూములకు ఇవ్వొద్దని స్పష్టీకరణ
- ఇతర దేశాల్లో ఉండే రైతులు, ఐటీ చెల్లించే వారికి వద్దని సూచన
- వ్యవసాయం చేసే రైతులు ఐటీ చెల్లించినా ఇవ్వాలని విజ్ఞప్తి
- రుణమాఫీ, రైతు భరోసాపై వ్యవసాయ, సహకార శాఖ సర్వే
- అభిప్రాయాలను స్పష్టంగా వెల్లడించిన రైతులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయనున్న రైతు భరోసాను ఒక్కో రైతుకు 10 ఎకరాల వరకు పరిమితం చేయాలని జిల్లాలోని మెజారిటీ రైతులు అభిప్రాయపడ్డారు. ఒక రైతుకు అంతకుమించి భూమి ఉన్నా రైతు భరోసా ఇవ్వాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. అంతేకాదు వ్యవసాయ భూములకు మాత్రమే రైతు భరోసా అమలు చేయాలని, రియల్‌ఎస్టేట్ వెంచర్లు, వ్యవసాయేతర భూములకు రైతు భరోసా ఇవ్వాల్సిన అవసరం లేదని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం జిల్లాలో 5,42,406 మంది రైతు బంధు పొందుతుండగా.. మరో 50 వేల మందికి పైగా రైతుబంధు రాని వారు ఉన్నారు. రుణమాఫీ, రైతు భరోసా అమలుకు విధివిధానాలు ఖరారు చేసేందుకు జూన్ 29వ తేదీ నుంచి ఈనెల 4వ తేదీ వరకు రైతుల అభిప్రాయలు సేకరించింది. సహకార శాఖ.. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో, వ్యవసాయ శాఖ.. రైతు వేదికల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి రైతుల అభిప్రాయాలను సేకరించి ప్రభుత్వానికి పంపించాయి.



అనుముల మండలం కొత్తపల్లి పీఏసీఎస్‌లో అభిప్రాయ సేకరణలో పాల్గొన్న చైర్మన్, డైరెక్టర్లు (ఫైల్)

25 అంశాల్లో అభిప్రాయ సేకరణ

జిల్లాలో సహకార శాఖ, వ్యవసాయ శాఖ 25 అంశాల్లో రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించింది. సహకార శాఖ తమ పరిధిలోని 43 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో సభ్యులైన వారిలో ప్రత్యేక సమావేశాలకు హాజరైన 2,922 మంది రైతుల అభిప్రాయాలు సేకరించగా, వ్యవసాయ శాఖ 295 మంది రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. మొత్తంగా 3217 మంది రైతులు వెల్లడించిన అభిప్రాయాలను క్రోడీకరించి నివేదికలను ఆయా శాఖలు ప్రభుత్వానికి పంపించాయి.

10 ఎకరాల సీలింగ్‌కే మెజారిటీ మొగ్గు..

రైతు భరోసా అమలుకు అనుసరించాల్సిన మార్గదర్శకాల కోసం నిర్వహించిన ప్రత్యేక సమావేశాల్లో ఒక్కో రైతుకు 10 ఎకరాల వరకే రైతు భరోసా ఇచ్చేలా సీలింగ్ అమలు చేయాలని సూచించారు. వ్యవసాయ సహకార సంఘాల్లోని సభ్యులు 838 మంది, వ్యవసాయ శాఖ సమావేశాల్లో మరో 118 మంది రైతులు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మొత్తంగా 956 మంది రైతులు (30 శాతం మంది) ఈ అభిప్రాయం వెల్లడించారు. దాంతోపాటు సాగు చేసిన భూములకు మాత్రమే రైతు భరోసా ఇవ్వాలని, వ్యవసాయేతర భూములకు, కొండలు, గుట్టలు, రియల్ ఎస్టేట్ భూములకు రైతు భరోసాను వర్తింపజేయవద్దని స్పష్టం చేశారు. ఆ తరువాత 5 ఎకరాల వరకు సీలింగ్ పెట్టాలని వివరించారు. మొత్తానికి అభిప్రాయాలను వెల్లడించిన మెజారిటీ రైతులు ఈ మూడు అంశాలకే ప్రాధాన్యం ఇచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులకు రైతు భరోసా ఇవ్వాల్సి అవసరం లేదని స్పష్టం చేశారు. ఇన్‌కం టాక్స్ చెల్లించే వారికి రైతు భరోసా ఇవ్వాల్సిన అవసరం లేదని పలువురు అభిప్రాయం వెల్లడించగా, ఇళ్ల నిర్మాణం, పిల్లల విద్య, ఇతరత్రా అవసరాల కోసం రైతులు ఇన్‌కమ్ టాక్స్ చెల్లించినా, వారికి రైతు భరోసా ఇవ్వాలని వివరించారు. వీటితోపాటు మరికొన్ని ప్రధాన అంశాల్లో రైతులు తమ అభిప్రాయాలను స్పష్టంగా వెల్లడించారు.

ప్రధాన అంశాలపై రైతులు అభిప్రాయాలు ఇలా..

చెప్పిన విషయం	రైతుల సంఖ్య		
10 ఎకరాల వరకు ఇవ్వాలి	956	ప్రభుత్వ ఉద్యోగులకు వద్దు	87
5 ఎకరాల వరకు ఇవ్వాలి	532	ప్రభుత్వ ఉద్యోగులకు కూడా ఇవ్వాలి	17
సాగు చేసిన వాటికే ఇవ్వాలి	426	ఐటీ చెల్లించేవారికి వద్దు	33
సాగుచేయని వాటికి, కొండలకు, రియల్ ఎస్టేట్ భూములకు ఇవ్వొద్దు	123	ఐటీ చెల్లించేవారికి ఇవ్వాలి	54
కౌలు రైతులకు ఇవ్వాలి	163	ఇళ్లు, విద్యా అవసరాలకు ఐటీ చెల్లించే రైతులకు ఇవ్వాలి	19
8 ఎకరాలకు ఇవ్వాలి	64	మొదటి పంటకు జూన్‌లో, రెండో పంటకు డిసెంబర్‌లో కచ్చితంగా ఇవ్వాలి	66
15 ఎకరాలకు ఇవ్వాలి	31	ప్రజాప్రతినిధులకు ఇవ్వొద్దు	8
20 ఎకరాలకు ఇవ్వాలి	31	రైతు భరోసా వద్దు, యంత్రాలు, విత్తనాలు, ఎరువులపై సబ్సిడీ ఇవ్వాలి	8
సాగుచేసిన మొత్తానికి పరిమితిలేకుండా ఇవ్వాలి	25		
రేషన్ కార్డుతో సంబంధం లేకుండా ఇవ్వాలి	28		

నివేదికలు పంపించాం

జిల్లాలోని పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించాం. ఆరు రోజుల పాటు రైతులతో సమావేశమై అభిప్రాయాలను సేకరించాం. వాటన్నింటిని క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదికలు పంపించాం.

– కిరణ్‌కుమార్, జిల్లా సహకార అధికారి

నిర్ణయం తీసుకోవాల్సింది ప్రభుత్వమే



రైతు భరోసా అమలుకు సంబంధించి రైతుల నుంచి సేకరించిన అభిప్రాయాలను క్రోడీకరించి ప్రభుత్వానికి పంపించాం. ఇక తుది నిర్ణయం తీసుకోవాల్సింది ప్రభుత్వమే. ఈ వానాకాలం పంటకు సంబంధించిన రైతు భరోసా మొత్తాన్ని వేయాల్సి ఉంది.

– శ్రావణ్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి

మత్స్య సంఘాల అడహక్ కమిటీ ఎన్నిక

నల్లగొండ టూటౌన్ : మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అడహక్ కమిటీని శనివారం నల్లగొండలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మత్స్యశాఖ అధికారి వెంకయ్య తెలిపారు. అడహక్ కమిటీ చీఫ్ ప్రమోటర్‌గా కనుకు వెంకటనారాయణ, ప్రమోటర్లుగా వెలుగు రవి, జునుకుల హరిప్రసాద్, మెరుగు వెంకన్న, బి.అజయ్‌కుమార్, చెన్నబోయిన వీరయ్య, జయమ్మ, సింగం లక్ష్మి, కోట్ల సైదయ్య, సూర బోయిన శ్రీనయ్య, సూర శంకర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ జిల్లా అధికారి వెంకయ్య మాట్లాడుతూ నూతన అడహక్ కమిటీ రెండు నెలల పాటు పదవిలో ఉంటుందని, జిల్లాలో కొత్త మత్స్య సంఘాల ఏర్పాటు కోసం కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. సమావేశంలో మత్స్యశాఖ సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీలకు వేళాయే..

- ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల ట్రాన్స్‌ఫర్స్‌కు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- 25వ తేదీలోగా ప్రక్రియ పూర్తిచేయాలని నిర్ణయం
- సీనియార్టీ జాబితాలు సిద్ధం చేస్తున్న అధికారులు
- ఒకేచోట నాలుగేళ్లుగా పని చేస్తున్నవారికి స్థానచలనం తప్పనిసరి

నల్లగొండ : ప్రభుత్వ శాఖల్లో బదిలీల సందడి నెలకొంది. ఇప్పటికే ఉపాధ్యాయులు బదిలీ ప్రక్రియను పూర్తి చేసిన ప్రభుత్వ.. తాజాగా ప్రభుత్వ శాఖల్లోని అన్ని కేటగిరి ఉద్యోగుల బదిలీ ప్రక్రియకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఉపాధ్యాయులు, పోలీసులు మినహాయించి మిగిలిన 56 శాఖల్లో 40 శాతం మందిని తప్పనిసరిగా బదిలీ చేయాల్సి ఉంది. ఆ లెక్కన జిల్లాలో ఉన్న సుమారు 3,500 మంది ఉద్యోగుల్లో దాదాపు 1400 మందికి స్థాన చలనం కలగనుంది. దీంతో జిల్లాలో ఎవరెవరు బదిలీ అవుతారు? ఎక్కడికి వెళ్తారనే చర్చ ఉద్యోగుల్లో జోరుగా సాగుతోంది.



జిల్లా స్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలో..

జిల్లాస్థాయి ఉద్యోగుల బదిలీలు కలెక్టర్ సారథ్యంలో జరగనుండగా, మల్టీజోనల్, రాష్ట్రస్థాయి బదిలీలు హైదరాబాద్ వేదికగా ఆయా శాఖ అధిపతుల పర్యవేక్షణలో జరుగుతాయి. రెండు సంవత్సరాలు ఒకే చోట పనిస్తున్న వారు సాధారణ బదిలీకి దరఖాస్తు చేసుకునేలా మార్గదర్శకాలు విడుదల చేశారు. జూన్ 30వ తేదీ నాటికి ఒకేచోట నాలుగేళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగులు అంతా తప్పనిసరిగా బదిలీ కానున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో ఆయా శాఖల జిల్లా అధికారులు ఉద్యోగుల వివరాల సేకరణలో నిమగ్నమయ్యారు. కేడర్ల వారీగా ఎన్ని ఖాళీలు ఉన్నాయి, ఎంతమంది ఉన్నారు, ఎప్పటి నుంచి విధులు నిర్వహిస్తున్నారన్న వివరాలతో ఈ నెల 8వ తేదీలోపు జాబితాలను సిద్ధం చేయాల్సి ఉంది. నాలుగేళ్లకు మించి ఒకేచోట పనిచేస్తున్న వారి జాబితాను ఈ నెల 8వ తేదీ వరకు విడుదల చేయనున్నారు.

సర్దుబాటు ఉద్యోగులకు అవకాశం దక్కేనా..

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక 2016 అక్టోబర్ 11న కొత్త జిల్లాలు ఏర్పడ్డాయి. ఆ సమయంలో ఉమ్మడి జిల్లా నుంచి కొంతమంది ఉద్యోగులను కొత్త జిల్లాలకు సర్దుబాటు చేశారు. 2018లో బదిలీలకు అవకాశం కల్పించినా.. కొందరు బదిలీ కాలేదు. 317 జీఓలోనూ కొందరు ఇతర జిల్లాల నుంచి ఇక్కడికి వచ్చారు. సొంత జిల్లాలకు పంపించాలని అప్పట్లో వారంతా ఆందోళన చేశారు. ప్రస్తుతం వీరికి రెండేళ్ల సర్వీసు పూర్తి కావడంతో ఇప్పుడు బదిలీల్లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కలిగింది. కానీ తమకన్నా సీనియర్లు ఉండడంతో తాము బదిలీ అవుతామో లేదోనని వారు ఆందోళన చెందుతున్నారు.

ఆయా స్థాయిలో ఉద్యోగులు..

- జిల్లాస్థాయిలో అటెండర్ మొదలుకొని రికార్డ్ అసిస్టెంట్, టైపిస్టు, జూనియర్ అసిస్టెంట్ జిల్లాలోని మండలాల పరిధిలో బదిలీ కానున్నారు.
- జోన్ పరిధిలో సీనియర్ అసిస్టెంట్ మొదలుకొని సూపరింటెండెంట్, డిప్యూటీ తహసీల్దార్, గ్రేడ్ –1, 2, 3 పంచాయతీ కార్యదర్శులు, హెచ్‌డబ్ల్యూఓ, ఏఎన్‌ఎం, స్టాఫ్‌నర్సు, ల్యాబ్ టెక్నీషియన్, వెటర్నరీ అసిస్టెంట్ వంటి హోదా కలిగిన ఉద్యోగులకు బదిలీలు జరగనున్నాయి.
- మల్టీజోన్ పరిధిలోని ఎంపీడీఓలు, తహసీల్దార్లు ఎన్నికల్లో బదిలీ అయ్యారు. వారంతా గతంలో పని చేసిన జిల్లాకు బదిలీ కానున్నారు.



పోలీసులకు రివార్డ్

పార్థి గ్యాంగ్‌ను పట్టుకున్న పోలీసు బృందానికి నగదు రివార్డు అందజేస్తున్న ఎస్పీ శరత్ చంద్రపవార్

సమ్మె ఒప్పందాలను అమలు చేయాలి

నల్లగొండ టౌన్ : జీఓ 10ని రద్దు చేయాలని, సమ్మె ఒప్పందాలను అమలు చేయాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.విజయలక్ష్మి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కలెక్టరేట్ ఎదుట యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలతో పాటు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ పెంచాలని, డిమాండ్ల సాధన కోసం ఈ నెల 10 నుంచి 15వ తేదీ వరకు కలెక్టరేట్‌ల ఎదుట రిలే నిరాహార దీక్షలు, 15, 16 తేదీల్లో 48 గంటలు ఎమ్మెల్యేల ఇండ్ల దగ్గర ధర్నాలు చేస్తామన్నారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ జీఓ 10ని రద్దు చేసి రిటైర్మెంట్ అయ్యే టీచర్లకు రూ.2 లక్షలు, హెల్పర్‌లకు రూ.లక్ష బెనిఫిట్ ఇచ్చి నెలకు రూ.8 వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డీడబ్ల్యూఓ సక్కుబాయికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, సత్తయ్య, బయ్యన్న, నాగమణి, పార్వతి, విజయలక్ష్మి, మన్నెమ్మ, పరిపూర్ణ, కె.రజిత, యాదమ్మ, లక్ష్మి, ప్రమీల, సైదమ్మ, సునంత, సరిత, స్వరాజ్యం, స్వప్న, అనిత, సుభాషిని, అరుణ, నర్సింహ, ముత్యాలు సుధీర్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నాలో మాట్లాడుతున్న విజయలక్ష్మి

జీజీహెచ్‌లో మందుల్లేవ్!

- వేధిస్తున్న అత్యవసర మందుల కొరత
- గ్యాస్‌గోలీలు, సెలైన్ బాటిళ్లూ లేని దుస్థితి
- యాంటీబయాటిక్స్ కూడా కరువే..
- బయట తెచ్చుకోవాలని స్లిప్‌పై రాస్తున్న డాక్టర్లు
- గత్యంతరం లేక కొని తెచ్చుకుంటున్న రోగుల బంధువులు

నల్లగొండ టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్) పేరుకే పెద్దాస్పత్రి.. ఇక్కడికి వస్తున్న రోగులకు సాధారణ మందులు కూడా దొరకని పరిస్థితి నెలకొంది. కొన్ని మందులు ప్రభుత్వం నుంచి సరఫరా లేకపోవడంతో పాటు మరికొన్నింటిని ఆస్పత్రి వర్గాలు కొనుగోలు చేయని కారణంగా కొరత ఏర్పడింది. ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చేరుతున్న రోగులకు అత్యవసర మందులు లభించడం లేదు. బయట కొని తెచ్చుకోవాలని వైద్యులే స్లిప్ రాసి ఇస్తున్నారు. దీంతో గత్యంతరం లేక రోగుల బంధువులు బయటకు వచ్చి ప్రైవేట్ మెడికల్ షాపుల్లో కొని తీసుకెళ్తూ వైద్యం చేయించుకుంటున్నారు.



వారం రోజుల క్రితం పురుగుల మందు తాగిన మిర్యాలగూడకు చెందిన ఓ వ్యక్తిని స్థానిక ఏరియా ఆస్పత్రి నుంచి నల్లగొండ జనరల్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. జీజీహెచ్‌లో అత్యవసర మందులు లేవని బయట దుకాణంలో కొనుగోలు చేయాలన్న వైద్యులు చిట్టిని రాసి అతని కుమారుని చేతిలో పెట్టారు. విధిలేని పరిస్థితిలో ఆయన మందులను బయట దుకాణంలో కొనుక్కుని తీసుకొచ్చాడు. సదరు పేషెంట్ పది రోజుల పాటు ఆస్పత్రిలో ఉంటే ప్రతిరోజూ వెయ్యి రూపాయల చొప్పున మందులను బయట కొనుక్కొని తెచ్చుకున్నారు. ఆస్పత్రిలో మందులు లేకపోవడంతో ఇలా వందలాది మంది రోగులు బయట ప్రైవేట్ మెడికల్ షాపుల్లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

మండలాల నుంచి కేసులు వస్తున్నా..

జిల్లాలోని అన్ని ఏరియా ఆస్పత్రులతో పాటుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి రోజూ అత్యవసర వైద్య సేవల కోసం రెఫరల్ కేసులు వస్తుంటాయి. దాంతో పాటుగా ప్రతిరోజూ 600 నుంచి 700 మంది వరకు అవుట్ పేషెంట్లుగా, వంద వరకు ఇన్‌పేషెంట్లుగా వైద్యం కోసం జీజీహెచ్‌కు వస్తుంటారు. అదే విధంగా మాతాశిశు ఆరోగ్య కేంద్రానికి గర్భిణులు, పరీక్షలు, కాన్పుల కోసం రోజూ వందల సంఖ్యలో జీజీహెచ్‌కు వస్తుంటారు. ఇలా నిత్యం రోగులలో కిటకిటలాడే ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మందుల కొరత ఉండడం విస్మయం కలిగిస్తోంది. రోజూ మందుల స్టాక్ వివరాలను సమీక్షించి రోగులకు అవసరమైనవి సరఫరా చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇక, పాయిజన్ కేసులు, పాముకాటు, తేలుకాటు, యాక్సిడెంట్ కేసులు ఆస్పత్రికి వస్తున్నా అత్యవసరం మందులు లేక రోగుల ప్రాణాలు కాపాడలేక డాక్టర్లు మనో వేదనకు గురవుతున్నారు. ఇటీవల జూనియర్, సీనియర్ డాక్టర్లు చేసిన విధుల బహిష్కరణ సందర్భంగా అత్యవసర మందులను కొనుగోలు చేయించాలనే ప్రధాన డిమాండ్ పెట్టినా ఇప్పటికీ మందులు కొనుగోలు చేయకపోవడం గమనార్హం. మందులను సరఫరాకు నల్లగొండ పట్టణంలోని ఒక మందుల ఏజెన్సీకి గతంలో కాంట్రాక్టు ఇచ్చినా దాన్ని ప్రస్తుతం ఓకే చేయకపోవడంతో మందులు అందుబాటులో లేవనేది వాస్తవం.

గ్యాస్ ట్యాబ్లెట్లు కూడా లేని దుస్థితి

నల్లగొండలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో 550 పడకల సామర్థ్యం ఉంది. రోగులు కూడా స్థాయికి మించి ఆస్పత్రిలో చేరుతున్నారు. అలాంటి జనరల్ ఆస్పత్రిలో రోగులకు పరిగడుపున ఇవ్వాల్సిన గ్యాస్ గోళీలు కూడా లేని పరిస్థితి. తక్కువ ధరలకు లభించే సెలైన్ బాటిల్స్ కూడా సరఫరా లేవు. అదే విధంగా హైడ్రోకార్టిసోన్, పాన్‌టాప్, నార్మల్ సెలైన్ బాటిల్స్, రాన్‌టాక్, రేడీస్ ఇమ్యునోగ్లోబులిన్స్ వంటి అత్యవసర మందులు కూడా లేకపోవడంతో మెరుగైన వైద్యం అందించలేకపోతున్నామని డాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిర్లక్ష్యంలో ఆస్పత్రి వర్గాలు

జీజీహెచ్‌కి ప్రభుత్వం నుంచి సరఫరా కాని అత్యవసర మందుల కొనుగోలుకు జిల్లా కలెక్టర్ అనుమతిని తీసుకునే వెసులుబాటు జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు ఉంది. అయినప్పటికీ అత్యసర మందులు కొనుగోలు చేయకుండా రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారుల స్పందించి జీజీహెచ్‌లో అత్యవసర, ఇతర మందులను రోగులకు అందుబాటులో ఉంచాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

అన్ని మందులు అందుబాటులో ఉన్నాయి

జిల్లా కేంద్ర ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. అత్యవరమైన మందులను కూడా కొనుగోలు చేసి సరఫరా చేస్తున్నాము. డాక్టర్లు అవసరమైన మందులకు ఇండెంట్ పెడితే అందుబాటులో ఉంచుతాము. మందుల కొరత ఏమీ లేదు.

– డాక్టర్ నిత్యానందం, జీజీహెచ్ సూపరింటెండెంట్

క్లుప్తంగా

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

భువనగిరి క్రైం: భువనగిరి–వంగపల్లి రైల్వే స్టేషన్ల మధ్య 244/6–8 మైలురాయి వద్ద రైలు పట్టాలపై శనివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు భువనగిరి జీఆర్‌పీ ఇన్‌చార్జి హెడ్‌కానిస్టేబుల్ రజిత తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించినట్లు ఆమె పేర్కొన్నారు. మృతుడి వయస్సు సుమారు 45 సంవత్సరాలు ఉంటుందని, మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

కోదాడ శివారులో మరో మృతదేహం..

కోదాడరూరల్: కోదాడ పట్టణ పరిధిలోని దుర్గాపురం సమీపంలో కేటీఎస్ స్కూల్, రేస్ కళాశాల మధ్య ఉన్న ఖాళీ స్థలంలో శనివారం గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 70 సంవత్సరాల వరకు ఉంటుందని అన్నారు. మృతుడు తెల్లటి చొక్కా, కళ్లజోడు ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. కుళ్లిపోయే స్థితిలో ఉన్న మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి పేర్కొన్నారు. మృతుడి గురించిన వివరాలు తెలిసిన వారు కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ సూచించారు.

ఆర్‌ఐపై దాడి.. మైనర్లపై కేసు నమోదు

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌పై దాడి చేసిన ఇద్దరు మైనర్లపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. తిప్పర్తి ఎస్‌ఐ డి. రాజు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న నరహరి, ఇతర సిబ్బంది శుక్రవారం ధరణి పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తూ రాత్రి వరకు కార్యాలయంలో ఉన్నారు. అదే సమయంలో నరహరి ఆఫీసు బయటకు నిర్మానుష్య ప్రాంతంలోకి బహిర్భూమికి వెళ్లాడు. అక్కడ తిప్పర్తి మండలంలోని సర్వారం, నూకతవారిగూడెం గ్రామాలకు చెందిన ఇద్దరు మైనర్లు మద్యం మత్తులో ఆర్‌ఐని బెదిరించడమే కాకుండా అతడిపై రాయి విసిరారు. దీంతో ఆర్‌ఐ కేకలు వేయగా ఆఫీసు సిబ్బంది రావడంతో మైనర్లు బైక్‌పై అక్కడి నుంచి పరారయ్యారు. సమీపంలోనే మైనర్లు ఇద్దరు ఆగినట్లు గుర్తించిన తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పోలీసులుకు సమాచారం ఇచ్చారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని, ఆర్‌ఐ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధికి కృషి

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- హైదరాబాద్‌లో మంత్రిని కలిసిన తెలంగాణ పారిశ్రామికవేత్తల సమాఖ్య ప్రతినిధులు



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న టిఫ్ ప్రతినిధులు

చౌటుప్పల్: చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామంలోని గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్ అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ పారిశ్రామికవేత్తల సమాఖ్య(టిఫ్) ప్రతినిధుల బృందం శనివారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లకు తూర్పు భాగంలోని యాదాద్రి, సూర్యాపేట, నల్లగొండ జిల్లాలు పారిశ్రామివాడల ఏర్పాటు అనువుగా ఉన్నాయని, ప్రభుత్వంతో కలిసి ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు సహకారం అందిస్తామని మంత్రికి తెలియజేశారు. దండుమల్కాపురం గ్రామంలోని గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్ 1855 ఎకరాల్లో విస్తరించిందని, ఇక్కడ 1550 పరిశ్రమల ఏర్పాటు ద్వారా రూ.6675కోట్ల పెట్టుబడులు వస్తాయని, ప్రత్యక్షంగా 45వేల మందికి, పరోక్షంగా మరో 35వేల మందికి ఉపాధి లభిస్తుందని మంత్రికి వివరించారు. అదేవిధంగా పార్కు ప్రధాన ద్వారం వద్ద హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై ఫ్లెఓవర్ బ్రిడ్జిని నిర్మించి ప్రమాదాలను నివారించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తమ సంపూర్ణ సహకారం ఉంటుందని తెలిపారు.

స్థానిక యువతకు ఉపాధి కల్పించడమే ధ్యేయం: ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ పరిసర ప్రాంతాల్లోని యువతకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెలిపారు. అందుకోసం ఇప్పటికే పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో సమీక్షలు నిర్వహించామని పేర్కొన్నారు. తెలంగాణ పారిశ్రామికవేత్తల సమాఖ్య(టిఫ్) ప్రతినిధులు శనివారం ఎమ్మెల్యేను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి సత్కరించారు. పలు సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉద్యోగాలు లేక గ్రామాల్లోని యువత చెడువ్యసనాలకు బానిసలుగా మారి తమ జీవితాలను ఆగం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చౌటుప్పల్ ప్రాంతానికి మరిన్ని పరిశ్రమలను తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఉన్న పరిశ్రమలతో పాటు నూతనంగా వచ్చే పరిశ్రమల్లో స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాలని యాజమాన్యాలకు సూచించారు. కార్యక్రమంలో టిఫ్ అధ్యక్షుడు కొండవీటి సుధీర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, టిఫ్ సీనియర్ జాయింట్ సెక్రటరీ మిరుపాల గోపాల్‌రావు, ప్రతినిధులు జలంధర్‌రెడ్డి, స్వామిగౌడ్, ఏఎల్ ఎన్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, మోహన్, వెంకట్‌రెడ్డి, రంగారావు, వీరస్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న టిఫ్ ప్రతినిధులు

రైతులు సేంద్రియ వ్యవసాయం చేయాలి

- నాబార్డు ఏజీఎం సత్యనారాయణ

నడిగూడెం: రైతులు సేంద్రియ వ్యవసాయం చేసేందుకు మొగ్గు చూపాలని నాబార్డు ఏజీఎం సత్యనారాయణ అన్నారు. గత పదిహేను రోజులుగా నడిగూడెం మండలం సిరిపురం రైతు వేదికలో నాబార్డు ఆర్థిక సహకారంతో మల్లెల రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో పొదుపు సంఘాల మహిళలకు సేంద్రియ వ్యవసాయంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రసాయన ఎరువుల వాడకంతో భూసారం దెబ్బతింటుందన్నారు. రసాయనాలతో పండించిన పంటలను ఆహారంగా తీసుకోవడం వలన రోగాలపాలవుతున్నామన్నారు. అలాగే స్వయం సహాయక సంఘాల సభ్యులు సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు తయారుచేయడానికి ముందుకొస్తే ఆర్థిక సహకారం అందిస్తామన్నారు. అనంతరం వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. మనతో పాటు, భవిష్యత్తు తరాలు కూడా ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి రైతు సేంద్రియ వ్యవసాయం చేపట్టాలన్నారు. సేంద్రియ సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. అనంతరం శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ హేమామాలిని, స్థానిక ఎస్‌బీఐ మేనేజర్ యాదగిరి, మల్లెల రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ చైర్మన్ మల్లెల కొండారెడ్డి, అభ్యుదయ రైతు వాసికర్ల శేషుకుమార్, నాగిరెడ్డి కవిత, బుచ్చిరాములు, పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాబార్డు ఏజీఎం సత్యనారాయణ

చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

మునగాల: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన ఇద్దరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్ల జిల్లా నిజాంపట్నం మండలం పల్లపట్ల గ్రామానికి చెందిన పవన్‌కుమార్, వెంకటకృష్ణ, మరో వ్యక్తి కలిసి శుక్రవారం బైక్‌పై హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి స్కూటీపై బయల్దేరారు. మార్గమధ్యలో మునగాల మండలం మాధవరం గ్రామ శివారులో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై నేలమర్రి క్రాస్ రోడ్డు వద్ద ముందు వెళ్తున్న గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో పవన్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్ర గాయాలపాలైన వెంకటకృష్ణతో పాటు మరో వ్యక్తిని పోలీసులు సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ వెంకటకృష్ణ శుక్రవారం అర్ధరాత్రి మృతిచెందినట్లు స్థానిక ఏఎస్‌ఐ కల్లు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

పిల్లలమర్రి గ్రామానికి చెందిన వృద్ధురాలు..

పెన్‌పహాడ్: సూర్యాపేట మండలం పిల్లలమర్రి గ్రామానికి చెందిన చెర్కుపల్లి గుర్వమ్మ(72) గత నెల పెన్‌పహాడ్ మండలం అనంతారం గ్రామంలోని తన రెండో చెల్లెలి ఇంటికి వచ్చింది. గత నెల 24వ తేదీన అక్కడి నుంచి నాగులపహాడ్‌లో ఉంటున్న తన మూడో చెల్లె ఒగ్గు లక్ష్మి ఇంటికి ఆమె కుమారుడు ఒగ్గు అశోక్ బైక్‌పై గుర్వమ్మను తీసుకెళ్తుండగా అనంతారం గ్రామ శివారులో గేదెలు అడ్డు రావడంతో అదుపుతప్పి కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో గుర్వమ్మ తలకు తీవ్రగాయాలు కావడంతో ఆమెను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలి మేనల్లుడు మామిడి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ వెంకటరత్నం పేర్కొన్నారు.

జలశక్తి అభియాన్ బృందం పర్యటన

పెద్దఅడిశర్లపల్లి: జలశక్తి అభియాన్ బృందం ప్రతినిధులు శనివారం గుడిపల్లి మండల కేంద్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా గుడిపల్లి మండల కేంద్రంలోని అవెన్యూ ప్లాంటేషన్, బత్తాయి తోటలు, ఇంకుడు గుంతలు, ఆయిల్ పామ్ తోటలను పరిశీలించారు. అనంతరం రైతు వేదిక వద్ద వన మహోత్సవంలో భాగంగా మొక్కను నాటారు. కార్యక్రమంలో కేంద్ర జలవనరుల శాఖ సహాయ కార్యదర్శి దివాకర్ మహంతి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, క్లస్టర్ ఏపీడీ బాలకృష్ణ, ఎంపీడీఓ చంద్రమౌళి, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఓ శ్రీను, టీఏలు గిరిబాబు, దశరథరెడ్డి, అలివేలు, కార్యదర్శి నవీన్, క్షేత్ర సహాయకులు గోలి రవి, అనిత తదితరులు పాల్గొన్నారు.



చింతపల్లి: మొక్క నాటుతున్న దివాకర్ మహంతి, తదితరులు

చింతపల్లిలో..

చింతపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో జలశక్తి అభియాన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమానికి కేంద్ర జలవనరుల శాఖ సహాయ కార్యదర్శి దివాకర్ మహంతి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి హాజరై మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో భాగంగా రైతుల భూముల్లో, ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో పండ్ల మొక్కలు, రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించాలన్నారు. అనంతరం మథనాపురం, గొడుకొండ్ల గ్రామ పంచాయతీలను సందర్శించారు. వారి వెంట ఎంపీడీఓ సుజాత, ఎంపీఓ ప్రవీణ్ శ్రీధర్, ఏపీఓ శౌరిరెడ్డి, ఎండీ జహంగీర్, సుధీర్, వెంకటయ్య, యాదయ్య, నాగరాజు, రవి, జ్యోతి తదితరులు ఉన్నారు.

గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

కోదాడరూరల్: కోదాడ పట్టణంలో నిషేధిత గుట్కా విక్రయిస్తున్న వ్యక్తిని శనివారం పోలీసులు అరెస్ట్ చేసి రూ.63వేల విలువైన గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని మసీద్ కాంప్లెక్స్‌లో పనిచేస్తున్న మహ్మద్ మోసిన్ కిరాణా షాపులో గుట్కాలు అమ్ముతున్నాడనే సమాచారం మేరకు దాడులు చేయగా రూ.63వేల విలువైన గుట్కాలు, పొగాకు ఉత్పత్తులు పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా నల్లగొండకు చెందిన మనోజ్, సూర్యాపేటకు చెందిన షేక్ నదీమ్ నుంచి గుట్కా ప్యాకెట్లు కొనుగోలు చేసి తన షాపులో విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నాడని, ఈ మేరకు సీఐ రాము కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీస్ స్టేషన్ గోడదూకి దొంగ పరార్

గరిడేపల్లి: విద్యుత్ మోటార్ల చోరీ కేసులో పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చిన దొంగ గోడదూకి పరారయ్యాడు. గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లి, రంగాపురం, వెలిదండ గ్రామాల పరిధిలోని వ్యవసాయ బావుల వద్ద ఇటీవల దాదాపు 50 విద్యుత్ మోటార్లను దొంగలు ఎత్తుకెళ్లారు. దీంతో కొంత మంది రైతులు కాపుగాసి గురువారం ఓ దొంగను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. పోలీసులు విచారణ చేపట్టి మరో ఇద్దరు దొంగలను పోలీస్ స్టేషన్‌కు తీసుకొని వచ్చారు. శుక్రవారం రాత్రి అందులో ఒక దొంగ టాయిలెట్‌కి వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లి పోలీస్ స్టేషన్ గోడదూకి పారిపోయాడు. దొంగను పట్టుకోవడానికి పోలీసులు గాలిస్తున్నారు.

అత్తపై కత్తితో దాడి చేసిన కోడలు

మోత్కూరు: మోత్కూరు మండలం రాగిబావి గ్రామంలో అత్తపై కత్తితో కోడలు దాడి చేసింది. ఈ ఘటన శనివారం జరిగింది. రాగిబావి గ్రామానికి చెందిన బాసాని సత్తమ్మతో ఆమె పెద్ద కోడలు జ్యోతి శనివారం సాయంత్రం గొడవ పెట్టుకుంది. ఈ క్రమంలో సత్తమ్మపై కత్తితో జ్యోతి దాడి చేసి పరారైంది. సత్తమ్మ తలకు తీవ్ర గాయంకావడంతో ఆమెను మోత్కూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. జ్యోతి, ఆమె భర్త కిష్టయ్య కొంతకాలంగా హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. రాగిబావి గ్రామంలోని తమ ఇంట్లో ఉంటున్న సత్తమ్మను ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోవాలని జ్యోతి కొద్దిరోజులుగా ఆమెతో గొడవ పడుతోంది. సత్తమ్మ ఎంతకూ ఇల్లు ఖాళీ చేయకపోవడంతో జ్యోతి శనివారం హైదరాబాద్ నుంచి వచ్చి కత్తితో దాడి చేసింది. సత్తమ్మ కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పోలీసుల అదుపులో ఇద్దరు దొంగలు

- నిందితుల నుంచి కత్తి, ద్విచక్ర వాహనం స్వాధీనం

చౌటుప్పల్: దొంగతనాలు చేసేందుకు వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామ శివారులోని టోల్‌ప్లాజా వద్ద శనివారం పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని మల్కాజ్‌గిరికి చెందిన మక్కనోల్ల పవన్‌కుమార్, మల్కాజ్‌గిరిలోనే నివాసం ఉంటున్న మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం పెద్దఅడివిరాళ్ల గ్రామానికి చెందిన బరిగెల శివకుమార్ కూలీ పనులు చేస్తుంటారు. వీరు దొంగతనాలకు పాల్పడుతుంటారు. ఈ క్రమంలో శనివారం ద్విచక్ర వాహనంపై చౌటుప్పల్ మీదుగా విజయవాడ వైపు వెళ్తుండగా.. చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీలు చేస్తున్న పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుంటుండగా.. తమ వెంట ఉన్న కత్తితో పోలీసులపై దాడి చేసేందుకు యత్నించారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారించగా చోరీలు చేసేందుకు వెళ్తున్నట్లు నిజం ఒప్పుకున్నారు. వీరిపై హైదరాబాద్ సీసీఎస్‌తో పాటు మల్కాజ్‌గిరి పోలీస్ స్టేషన్‌లోనూ పలు కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్‌రెడ్డి పేర్కొన్నారు.

పీఈటీ ఉపాధ్యాయుడికి ఘనంగా వీడ్కోలు

నిడమనూరు: 13ఏళ్లు ఒకే పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్తున్న పీఈటీ సార్‌కు గ్రామస్తులు, విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. నిడమనూరు మండలం ముకుందాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్న సత్యనారాయణకు పీడీగా ప్రమోషన్ రావడంతో తిరుమలగిరి ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. ముకుందాపురం పాఠశాలకు 2011లో బదిలీపై వచ్చిన ఆయన పాఠశాల విద్యార్థులను వాలీబాల్‌లో జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దారు. గతంలోనే ఆయన వేరే పాఠశాలకు బదిలీ అయినప్పటికీ విద్యార్థుల వినతి మేరకు బదిలీ ప్రక్రియను నిలిపివేశారు. శనివారం పీఈటీ సత్యనారాయణను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గ్రామంలో ఊరేగించారు. ఇన్నాళ్లు తమను ఆటలు ఆడించిన సారు తన పాఠశాల నుంచి వెళ్లిపోతుండడంతో విద్యార్థులు కన్నీటిపర్యంతమయ్యారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు చూపిస్తున్న అభిమానం వెలకట్టలేనిదని సత్యనారాయణ అన్నారు.



బదిలీపై వెళ్తున్న పీఈటీ సత్యనారాయణను ఊరేగిస్తున్న విద్యార్థులు

పోలీసులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ధర్నా

కోదాడ రూరల్: భూమి పంచాయితీలో తమకు న్యాయం చేయకపోగా.. సీఐ తమనే ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆరోపిస్తూ కోదాడ పట్టణ పరిధిలోని తమ్మర గ్రామానికి చెందిన ఎస్. ధనలక్ష్మికి పలువురు మహిళలతో కలిసి శనివారం కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. ధనలక్ష్మికి తన తండ్రి పసుపుకుంకుమ కింద ఇచ్చిన భూమిలో తన వాటా ఇవ్వకుండా ఆమె సోదరుడు మరొకరికి విక్రయించాడు. దీనిపై పంచాయితీ నడుస్తోంది. అయితే కోర్టు నుంచి ఆర్డర్ తెచ్చుకున్నప్పటికీ ఆ స్థలంలో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బాధితురాలు ఆరోపించింది. అంతేకాకుండా తమనే సీఐ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి భయభ్రాంతులకు గురిచేసి దుర్భాషలాడాడని వాపోయింది. దీనిపై పట్టణ సీఐ రామును వివరణ కోరగా.. బాధితురాలు భూమి పంచాయితీలో న్యాయం చేయమని తమను ఆశ్రయించారని, కానీ అది తమ పరిధిలోకి రాదని చెప్పడంతో ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు.

ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లో సాంకేతిక సమస్య

- మిర్యాలగూడలో రెండు గంటలపాటు నిలిచిన రైలు
- ప్రయాణికుల ఇక్కట్లు

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడలో ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైలు శనివారం ఉదయం సాంకేతిక సమస్యతో నిలిచిపోయింది. హౌరా నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న క్రమంలో ఓ బోగి చక్రంలో సాంకేతిక సమస్య తలెత్తింది. దామరచర్ల మండలం కొండ్రపోల్ రైల్వే స్టేషన్ వద్ద స్టేషన్ మాస్టర్ రైలు బోగి చక్రం శబ్దంలో తేడా రావడాన్ని గమనించి రైల్వే స్టేషన్ అధికారులకు సమాచారం అందించాడు. అప్రమత్తమైన అధికారులు రైలును మిర్యాలగూడ స్టేషన్‌లో నిలిపివేశారు. టెక్నికల్ సిబ్బంది వచ్చి మరమ్మతులు చేయడంతో రైలు బయల్దేరి వెళ్లింది. రెండు గంటల పాటు రైలు నిలిచిపోవడంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురయ్యారు.



మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌లో నిలిచిన ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైలు

ప్రభుత్వ భూమి ఆక్రమణకు యత్నం

- ముగ్గురిపై కేసు నమోదు

నడిగూడెం: ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు యత్నించిన ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నడిగూడెం మండలం సిరిపురం గ్రామంలోని సర్వే నంబర్ 311లో ఐదెకరాల ప్రభుత్వ భూమిని శనివారం అదే గ్రామానికి చెందిన మొక్క నర్సింహారావు, శ్రీను, వీరభద్రం చదును చేసి ఆక్రమించేందుకు యత్నించారు. తహసీల్దార్ హేమామాలిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జి.అజయ్‌కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

నూతనకల్: బైక్‌పై వెళ్తున్న వ్యక్తి రోడ్డు పక్కన రేలింగ్‌ను ఢీకొట్టి మృతిచెందాడు. ఈ ఘటన నూతనకల్ మండలం ఎర్రపహాడ్ క్రాస్ రోడ్డు వద్ద శనివారం తెల్లవారుజామున జరిగింది. ఎస్‌ఐ జూకూరి సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. నూతనకల్ మండలం పెదనెమిల గ్రామానికి చెందిన తన్నీరు సత్యనారాయణ(44) కుమార్తె సూర్యాపేటలోని ఆస్పత్రిలో డెలివరీ కావడంతో ఆమెను చూసి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎర్రపహాడ్ క్రాస్ రోడ్డు సమీపంలో 365వ నంబర్ జాతీయ రహదారి మూలమలుపు వద్ద రోడ్డు పక్కన ఉన్న రేలింగ్‌ను ఢీకొట్టి తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఉమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తుంగతుర్తి ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎంజీయూలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ

నల్లగొండ రూరల్: మహాత్మాగాంధీ యూనివర్సిటీలో అధ్యాపకులు, విద్యార్థులకు న్యూఢిల్లీకి చెందిన ఎడ్యునెట్ ఫౌండేషన్, టాస్క్ సహకారంతో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తున్నట్లు శనివారం యూనివర్సిటీ ప్లేస్‌మెంట్ డైరెక్టర్ ప్రశాంతి తెలిపారు. ఇందు కోసం రూ.30లక్షలతో 25 కంప్యూటర్లు సమకూర్చుకున్నట్లు పేర్కొన్నారు. ఎంజీయూ ఇంజనీరింగ్ కళాశాలలో సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేసి అధ్యాపకులు, 25 మంది ఎంసీఏ విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చామన్నారు. ఈ శిక్షణకు మూడేళ్ల పాటు ఎడ్యునెట్ ఫౌండేషన్, టాస్క్ సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ పవన్, సుమిత, రవీందర్‌సింగ్, మహేష్, మోహన్, శ్రీకాంత్, ప్రదీప్‌రెడ్డి, సుధీర్, రేఖ, హరీష్, జయంతి తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇళ్లలో చోరీ

సూర్యాపేట టౌన్: సూర్యాపేట జిల్లా కేంద్రంలో శుక్రవారం అర్ధరాత్రి తాళం వేసిన రెండు ఇళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని భగత్సింగ్ నగర్‌లో అద్దెకు ఉంటున్న వట్టికూటి లింగయ్య శుక్రవారం బంధువుల ఊరికి వెళ్లాడు. ఇది గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని తులంన్నర బంగారం, 15 తులాల వెండి ఎత్తుకెళ్లారు. శనివారం ఇంటికి వచ్చిన లింగయ్య తాళం పగులగొట్టి ఉండటంతో దొంగతనం జరిగిందని గ్రహించి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అదేవిధంగా చింతల చెరువు రోడ్డులో మరొకరి ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి క్వింటాల్నన్నర బియ్యం, గ్యాస్ సిలిండర్ ఎత్తుకెళ్లారు. దీనికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పీడీఎస్ బియ్యం దందాలో రేషన్ డీలర్లు

- వాడపల్లి వద్ద పట్టుబడిన 22 టన్నుల పీడీఎస్ బియ్యం
- కీలకంగా వ్యవహరించిన నేరేడుచర్ల మండలానికి చెందిన ముగ్గురు డీలర్లు
- ఒకరిపై కేసు నమోదు
- మరో ఇద్దరు డీలర్లను విచారిస్తున్న పోలీసులు, సివిల్ సప్లయ్ అధికారులు

నేరేడుచర్ల: పీడీఎస్ బియ్య దందాలో పలువురు రేషన్ డీలర్లు కీలకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. దామరచర్ల మండలం వాడపల్లి వద్ద శుక్రవారం పోలీసుల తనిఖీల్లో ఆంధ్రప్రదేశ్‌కు లారీలో తరలిస్తున్న 22టన్నుల పీడీఎస్ బియ్యం పట్టుబడింది. ఈ పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాలో నేరేడుచర్ల మండలానికి చెందిన రేషన్ డీలర్లు కీలకంగా వ్యవహరించడంతో జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు అప్రమత్తమయ్యారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా నేరేడుచర్ల మండల మేడారం గ్రామ రేషన్ డీలర్ కరణం పాండయ్య పేరు చెప్పడంతో అతడిని పోలీసులు అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. ఇందులో బక్కయ్యగూడెం, పెంచికల్‌దిన్నె రేషన్ డీలర్లు కోన సత్యం, మిట్ట రాజేశ్వరి పాత్ర కూడా ఉన్నట్లు తెలియడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మేడారం గ్రామ డీలర్ పాండయ్యకు స్టాక్ కేటాయించినప్పటికీ తీసుకురాలేదని విచారణకు వెళ్లిన సివిల్ సప్లయ్ అధికారులు నిర్ధారించారు. దీంతో 22 టన్నుల పీడీఎస్ బియ్యం ఎక్కడికి తీసుకెళ్తున్నారనే విషయంపై అధికారులు దృష్టి సారించారు.



తహసీల్దార్ వద్ద బైండోవర్ చేస్తున్న పోలీసులు

విచారణ చేపడుతున్నాం..

సామాజిక మాధ్యమాల ద్వారా 22 టన్నుల రేషన్ బియ్యం పట్టుబడిన విషయం తెలుసుకుని మేడారం గ్రామ రేషన్ డీలర్ పాండయ్యకు సంబంధించిన స్టాక్‌ను పరిశీలించినట్లు సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్ తెలిపారు. ఈ నెల అతడు స్టాక్ తీసుకురాలేదని తేలడంతో విచారణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అతడిపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసిందని, తమకు ఎఫ్ఐఆర్ కాపీ అందితే చర్యలు తీసుకుంటామని వివరించారు. పెంచికల్‌దిన్నె, బక్కయ్యగూడెం గ్రామాల రేషన్ డీలర్లను కూడా విచారిస్తున్నట్లు పేర్కొన్నారు.

నలుగురి బైండోవర్..

నేరేడుచర్ల మండలంలో గతంలో పీడీఎస్ బియ్యం దందాకు పాల్పడిన నలుగురిని బైండోవర్ చేసినట్లు స్థానిక ఎస్‌ఐ రవీందర్‌నాయక్ తెలిపారు. గతంలో 9 మంది పీడీఎస్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నామని, అందులో మిర్యాలగూడకు చెందిన మేషవరపు కృష్ణ, పులగంబండతండాకు చెందిన బానోతు నాగు, బానోతు ఉపేందర్, హుజూర్‌నగర్‌కు చెందిన కావలి మునిలిని పిలిపించి తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

పౌరసరఫరాల శాఖ గోదాము తనిఖీ..

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లోని పౌరసరఫరాల శాఖ గోదామును జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాములోని స్టాక్‌ను పరిశీలించారు. స్టాక్‌లో 424 క్వింటాళ్ల బియ్యం తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. హుజూర్‌నగర్ ప్రాంతానికి చెందిన రేషన్ బియ్యం దామరచర్ల మండలం వాడపల్లి వద్ద పట్టుబడ్డ నేపథ్యంలో తనిఖీలు చేపట్టినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాములు తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని పేర్కొన్నారు. ఆయన వెంట ఏఎస్ఓ పుల్లయ్య, సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్ ఉన్నారు.